విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

రైతులకు ఎకరానికి రూ.10వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-గుడివాడ : సాగుచేస్తున్న ప్రతి రైతుకు ఎకరానికి రూ.10వేలు సాగుసాయం రాష్ట్ర ప్రభుత్వం అందించాలని సిపిఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు అధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడలో జరిగే ఛలో విజయవాడ రైతుల ధర్నా పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా కార్యదర్శి తాతయ్య మాట్లాడుతూ దేశంలో రైతు ఆత్మహత్యలలో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉండడం భాదకరమన్నారు. పేదరైతులు, కౌలురైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉండం వల్లే ఉత్పత్తులు అమ్ముకోలేకపోతున్నరన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలోని ప్రతి రైతు 2,45లక్షల రుణభారంతో ఉన్నారన్నారు. 10 డిమండ్‌లతో ఈ నెల 7వ తేదిన ఛలో విజయవాడలో జరిగే రైతుల ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఎం.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం చినముత్తేవి శివారు కోలెంటి వారి గూడెం వద్ద గేదెలకోడు డ్రైన్‌లో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయిన వ్యక్తి మృతదేహం మంగళవారం ఉదయం పెదముత్తేవికి సమీపంలోని డ్రైన్‌లో గ్రామస్తులు కనుగొన్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియపరచడంతో శవాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న గేదలకోడు మురుగుకాలవలో గేదెలను కడగడానికి వెళ్లిన ఉడుముల రాము (45) కాలుజారి పడిపోయాడు. మొవ్వ ఫైర్ స్టేషన్ అధికారి కే వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో రెస్క్యూటీమ్ ఏ శ్రీకాంత్ (లీడింగ్ ఫైర్ మాన్), జి శ్రీను (డ్రైవర్), ఏవి పూర్ణచంద్రరావు (ఫైర్ మాన్), హోంగార్డులు డి ఎస్ ఆర్ కే ప్రసాద్, జి కృష్ణమూర్తి, జి నాగరాజులు గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తును డి.సందీప్ నిర్వహిస్తున్నారు. కాగా శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పథకాల సేవలందించే ప్రక్రియే 'జగనన్న సురక్ష'

విశాలాంధ్ర-మచిలీపట్నం : పథకాల సేవలందించే ప్రక్రియే జగనన్న సురక్ష అని, కృష్ణా జిల్లావ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాల పలు శిబిరాలలో సుమారు లక్ష మంది ప్రజలు హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలు 90శాతం మందికి అందించడం పట్ల వారు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశపు మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష కృష్ణా జిల్లా ప్రగతి నివేదిక ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరైన ధృవపత్రాలు లేని కారణంగా, లేక ఇతరత్రా కారణాల వల్ల అక్కడక్కడా పథకాలు పొందకుండా మిగిలిపోయిన వారిని జల్లెడపట్టి వారి వివరాలు సేకరించి వారికి అవసరమైన పథకాలు, సేవలందించే కార్యక్రమం నెలరోజుల పాటు జిల్లాలో చురుగ్గా సాగిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి కుల, మత, ప్రాంతీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతివారికి సంక్షేమ పథకాల సేవలందించే ప్రక్రియే జగనన్న సురక్ష కార్యక్రమం అని కలెక్టర్ తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెలరోజులపాటు కృష్ణాజిల్లాలోని గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని 508 సచివాలయాల్లో నిర్వహించారని, 55 టీములు, 32 మంది ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో 9,566 మంది వలంటీర్లు జిల్లాలో 6 లక్షల 11 వేల 635 మంది సర్వే చేయవలసిన కుటుంబాలు ఉండగా, సర్వే చేసిన కుటుంబాల సంఖ్య 5 లక్షల 47 వేల 947 మంది కుటుంబాల వద్దకు వాలంటీర్లు స్వయంగా వెళ్లి వివరాలు సేకరించారన్నారు. జగనన్న సురక్ష - కృష్ణా జిల్లాలో అందించిన ప్రముఖమైన 20 సేవలు గూర్చి కలెక్టర్ పి. రాజబాబు వివరించారు. ఇంటిగ్రేటెడ్ కుల ధ్రువపత్రాలు 1,19,916, ఆదాయ ధ్రువ పత్రాలు 98,269, ఆధార్ కార్డ్ మొబైల్ నంబర్ అప్డేట్ 15,033, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ యొక్క పునః జారీ 8,140, ఆదాయం సర్టిఫికేట్ పునః జారీ 5,713, రైస్ కార్డ్ నందు సభ్యుని చేర్చుట 1037, కంప్యూటరైజ్డ్ డంగల్ ధ్రువపత్రం 543, కొత్త రైస్‌కార్డ్ 437, ఆర్‌ఓఆర్ 1 బి ధ్రువపత్రం 437, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం 412, రైస్ కార్డు విభజించడం 403, వివాహ సందర్భ కారణపు కుటుంబ సభ్యుల విభజన 396, పంట సాగుదారు హక్కుల కార్డు 191, వ్యవసాయ భూములకు నీటి పన్ను చెల్లింపు రెవెన్యూ 74, రైస్ కార్డ్ నందు సభ్యుని తొలగించుట 71, ఒంటరి కుటుంబ సభ్యుల విభజన 62, గ్రామీణ ప్రాంతపు వివాహ ధృవీకరణ పత్రం 50, ఆస్తి ఆదాయపు ధ్రువపత్రం 48, కొత్త వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డ్ 34, ఓబీసీ ధ్రువపత్రం 29 ఆమోదింపబడినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి

ఎం. వెంకటేశ్వర్లు,డిఎల్ డిఓ సుబ్బారావులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు సంచారాన్ని అరికట్టాలి

నగరంలో పశువులు రహదారికి అడ్డంగా లేకుండా చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, జిల్లాఅధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రహదారుల్లో పశువుల తొలగింపు, ఆక్వా జోన్, ఓటర్ల జాబితా పరిశీలన, జగనన్నకు చెబుదాం అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నం నగరంలో పలుచోట్ల రహదారుల్లో అడ్డంగా పశువులు ఉంటున్నాయని దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నగరంలో ఎక్కడా కూడా రహదారుల్లో పశువులు ఇకపై ఉండరాదని స్పష్టం చేశారు. తక్షణమే మునిసిపల్ కమిషనర్ స్పందించి ఆర్టీఓ రవాణా, పోలీసు శాఖల సమన్వయంతో రహదారుల్లో పశువులు లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులైన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో మొత్తం ఎంత విస్తీర్ణంలో ఆక్వాజోన్, నాన్ ఆక్వా జోన్ ఉందో వివరాలు సేకరించాలని, ఆక్వా జోన్ల పరిధిలో ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు ఏ మేరకు ఉన్నాయో వాటి వివరాలతో కూడిన నివేదికను ఈ నెల 11 వ తేదీలోగా అందించాలని కలెక్టర్ జిల్లా మత్స్యశాఖ అధికారిని సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారులను ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్ మచిలీపట్నం, ఉయ్యూరు గుడివాడ ఆర్డీవోలు ఐ.కిషోర్, విజయ్ కుమార్, పద్మావతి మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవోలు తహసిల్దార్లు పాల్గొన్నారు.

రూ.8 లక్షలతో ఉప్పుటేరు వద్ద ర్యాంపు

విశాలాంధ్ర-కుత్తివెన్ను : పల్లిపాలెం గ్రామపంచాయతీ ఉప్పుటేరు రేవు వద్ద ఎనిమిది లక్షల రూపాయలు నిధులుతొ ర్యాంపు నిర్మాణం చేయనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన గ్రామంలో ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ నుండి ప్రజలు అందుతున్న సంక్షేమ పథకాలను గురించి ఆరా తీశారు. ఇంకా ఏమైనా పథకాల అవసరమా అని పేద ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి బాలగంగాధరరావు, స్థానిక సర్పంచి కొల్లాటి రాజు, వైసిపి మండల కన్వీనర్లు వైధాని వెంకటరాజు, రాజబాబు కూనసాని లక్ష్మోజి, పులగం సుబ్రమణ్యం, పులగం రాము ఆకన సాయి, రేవు నరసింహారావు, నరసింహారావు, కొప్పాడి నాగార్జున, కొక్కిలిగడ్డ బాపూజీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం చినముత్తేవి శివారు కోలెంటి వాని గూడెంవద్ద ప్రమాదవశాత్తు కాలవలో పడి మృతి చెందినఉడుముల రాము కుటుంబాన్ని ఆదుకోవాలంటూ పామర్రు ఎమ్మెల్యే కైలేఅనిల్ కుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్ పి.రాజబాబును కోరారు. ఆయన మృతుని కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. అంతకు ముందుగా మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో జరిగిన పోస్టుమార్టంను వెంటనే చేయించి అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం ఓదార్చేరు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద తుమ్మిడిలో ప్రతి నెల మొదటి మంగళవారం ఆశా డే కార్యక్రమం డాక్టరు సువర్చల ఆధ్వర్యంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బంటుమిల్లి మండలం ప్రజాపరిషత్ అధ్యక్షులు వెలివెల తారశశిజ్యోష్ణా కృష్ణ (చినబాబు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మలేరియా, డెంగీ, డైయారియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా గ్రామాలలోని ప్రజలకు అవగాహన కలిగంచాలని అన్నారు. ముఖ్యంగా గర్భవతులను నమోదు చేసి వారికి అనీమియా (రక్తహనత) రాకుండా ఐరన్ మాత్రలు అందజేయడం, ఆరోగ్య పరీక్షలు చేయడం పోషకాహారం గురించి వివరించాలన్నరు. పరిసరాల పరిశుభ్రత గురించి, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు గురించి ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టరు వి జయశ్రీ, ఎం ఏడుకొండలరావు, పెద్ది శ్వరి, హెల్త్ సూపర్ వైజర్ ఎం ఏసుదాసు, కమల రత్నం, హెల్త్ అసిస్టెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడులో కాల్వల పూడికతీత

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు నాటు వేసిన వరి పొలాలు పూర్తిస్థాయిలో మునిగిపోవడంతో పెదపారుపూడి గ్రామ రైతులు కొంతమంది పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి తన సొంత నిధులు వెచ్చించి ప్రొక్లైన్ సహాయంతో గుర్రపు డెక్క మరియు పూడికతీత ప్రారంభించినట్లు ఎంపీపీ గోగం సురేష్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ జాజుల చిన్నారి, వైసిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో...

ఇటీవలనే కురిసిన వర్షాలకు వేల్పూరు పరిధిలోని పొలాలు రేగోడు డ్రైన్ మురుగు ఎగతట్టి పరిసర ప్రాంతాలలో పొలాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయని వేల్పూరు, ఐనంపూడి తెలిపారు. పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార రాజా తన సొంత ఖర్చులతో జెసిబి ఏర్పాటు చేసి రేగోడు డ్రైన్ పూడిక తీయడంతో పొలాల్లో ఎగతట్టిన మురుగు నీరు ఒక రోజు లో పోయాయని వరి మొక్కలు బయట పడ్డాయని రైతు నాగేశ్వరరావు తెలిపారు. మిగిలిన పొలాల్లో నాట్లు వేయుటకు ప్రయత్నం చేస్తున్నారు.

సబ్‌ప్లాన్ నిధులు నవరత్నాలకు మళ్లించరాదు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సబ్ ప్లాన్ నిధులను నవరత్నాల పథకాలకు మళ్లించడం దళిత గిరిజనులను దగా చేయడమే అవుతుందని దళిత గిరిజన జెఏసి చైర్మన్ (మాజీ ఐఏఎస్ అధికారి)టి.గోపాల్‌రావు తెలిపారు.మంగళవారం గాంధీనగర్ లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశాలు ఆయన మాట్లాడుతూ అనాడు దళిత,గిరిజనుల సంక్షేమానిక,అభివృద్ధి కోసం కమ్యూనిస్టు పార్టీలతో కలసి అనేక పోరాలు చేసిన ఫలితంగానే ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ అనేది వచ్చిందని అయితే 10 సం..లు కలపరిమితిని అనాడు తాము వ్యతిరేకించటం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కాలపరిమితి అవుతుండటంతో మరలా ఉద్యమాలు చేయటడంతో దానిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో 10 సం.లు పెంచుతూ జీవో ఇచ్చారన్నారు.అందుకు కృతజ్ఞతలు చేపుతున్నామని అయితే కాలపరిమితి అనేది ఉండకుండా శాశ్వత చట్టంగా చేయాలని డిమాండ్ చేశారు.దళిత గిరిజనులకు సమాజంలోని ఇతర వర్గాలకు మధ్యనున్న అంతరాలను పూర్చే నిమిత్తం ఖర్చుపెట్టాల్సిన సబ్ ప్లాన్ నిధులను నవరత్నాలు,ఇతర సాధారణ పథకాలకు మళ్లించటం దళిత గిరిజనులను దగా చేయడమే అన్నారు. అందరికీ వర్తించే సాధారణ పథకాలకు సబ్ ప్లాన్ నిధులు కేటాయించడానికి అనుమతిస్తున్న చట్టం లోని 3వ అధ్యాయం సెక్షన్ 11 (సి)ని వెంటనే తొలగించాలన్నారు. అన్ని శాఖల క్షేత్రస్థాయి అధికారులు, ఉద్యోగులకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి.ఈ సమావేశంలో పనబాక కృష్ణయ్య, కొరివి వినయ్ కుమార్, పోతుల బాలకోటయ,తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ పురిటిగడ్డ పీహెచ్‌సీ తనిఖీ

విశాలాంధ్ర-చల్లపల్లి : జిల్లా వైద్యశాఖ అధికారిణి డాక్టర్ జి. గీతా భాయి మంగళవారం పురిటీగడ్డ పీహెచ్సీని సందర్శించారు. ఆశా డే రివ్యూ సమావేశంలో పాల్గొని మాతాశిశు సంరక్షణ, వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యసహాయం తదితర అంశాలపై సమీక్షించారు. వ్యవసాయ పనుల నేపథ్యంలో పాము కాటు ఇంజక్షన్లు (యాంటీ స్నేక్ వీనం) అందుబాటులో ఉంచాలనీ, పాము కాటు బాధితులకు వైద్యసహాయం అందించాలని ఆదేశించారు. మిషన్ ఇంద్రధనస్సు, ఆగస్టు 10న జరిగే డీ.. వార్మింగ్ డే కార్యక్రమాలపై తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్ కే జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.రత్నగిరి, ఆశా డీసీఎం తారక్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ బి.రాజేంద్రకుమార్, వైద్యాధికారులు డాక్టర్ కె.వి.పద్మావతి, డాక్టర్ కె.విజయరావు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎఫ్.ఎ-1 పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-పమిడిముక్కల: ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలో సిబిఎ ఎఫ్.ఎ-1 పరీక్షలు ప్రశాంతం ప్రారంభమయ్యాయి. మండలం లో ప్రశ్నపత్రాలను ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు డి.సి.ఇ.బి.పేపర్లు యంఆర్సిల ద్వారా సరఫరా చేశారు.ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి ప్రశ్నాపత్రాలను కాంప్లెక్స్ ద్వారా హెచ్ఎంకి అందజేశారు. ఉపాధ్యాయులు బదిలీల వలన కొన్ని పాఠ్యంశాలు అవలేదని విమర్శ విద్యార్థులు ద్వారా తల్లిదండ్రులు అంటున్నారు.

అధ్వాన రహదారులతో వాహనదారుల ఇక్కట్లు

విశాలాంధ్ర-చల్లపల్లి : అధ్వాన్న రహదారులతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు ఎదురుగా నడకుదురు రోడ్డు మలుపులో మంగళవారం సాయంత్రం ట్రక్కు ఆటో వెనుక టైరు పూర్తిగా దిగబడిపోయింది. రోడ్డు మలుపు పూర్తిగా దెబ్బతిని గోతులమయంగా మారగా, గత కొన్నిరోజుల క్రితం వాటర్ ట్యాంకర్ టైరు దిగబడిపోయింది. రోడ్డు అడుగున ఉన్న వాటర్ పైప్ లైను సైతం దెబ్బతినగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పైపులైనుకు మరమ్మత్తులు నిర్వహించి లారీ వెట్మిక్స్ పోసినప్పటికీ టిప్పర్ల రాకపోకలకు రోడ్డు గోతులమయంగా మారింది. ఆర్అండ్బి అధికారులు రహదారికి మరమ్మత్తులు చేయకపోవటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టిపాత్రలు విక్రయిస్తూ గ్రామాలు తిరుగుతున్న రాజస్థాన్ కు చెందిన ట్రక్కు ఆటో మలుపుతిరుగుతుండగా గోతిలో ట్రక్కు ఆటో టైరు కూరుకుపోయింది. ఆ సమయంలో అటుగా వచ్చిన జేసీబీ బక్కెట్తో ముందుకు నెట్టేసరికి ఆటోటైరు బయటపడింది. ఇప్పటికైనా ఆర్అండ్బ అధికారులు స్పందించి రహదారికి మరమ్మత్తులు నిర్వహించాలని వాహనదారులు కోరుతున్నారు.

దివ్యాంగులకు వాహనాల పంపిణీ

విశాలాంధ్ర-గన్నవరం : స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఉంగుటూరు బాపులపాడు, గన్నవరం, విజయవాడ రూరల్ మండలంలోని 12 మందికి రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్స్, 11 మందికి దివ్యాంగులకు త్రి వీలర్ మోటార్ సైకిల్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల బాటలో మన ఎమ్మెల్యే వంశీమోహన్ సొంత నిధులతో లక్షలాది రూపాయలు వెచ్చించి రైతులకు సబ్సిడీ పై ట్రాక్టలు ఇచ్చిన ఘనత వంశీ మోహన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యాలయం ఇంచార్జి మెచినేని వెంకట శివసత్యనారాయణ, విజయవాడ రూరల్ మండల జడ్పిటిసి సువర్ణరాజు, బాపులపాడు ఎంపీపీ నగేష్, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండీ గోసాని. నిడమనూరు సర్పంచి శీలం రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఇంటెన్షిప్'తో ఉద్యోగం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వలోని వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల బీఎస్సీ (మూడవ సంవత్సరం, ఎంఈసిఎస్) విద్యార్థిని బొల్లా నాగ భావన ఇంటెన్షిప్ చేయడం ద్వారా ఉపాధి లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఇంటెన్షిప్ చేయడం ద్వారా ఉద్యోగానికి ఎంపిక అయిందని, సంవత్సరానికి రూ.1.80 లక్షల ప్యాకేజీ వేతనంగా అందజేస్తారని ఆమె వివరించారు. ఈ స్థితిలో ఇంటెన్షిప్ యొక్క ప్రాధాన్యతను తెలుసుకొని ఉద్యోగాలు పొందడానికి కృషి సల్పాలంటూ ఆమె విద్యార్థులకు సూచించారు .ఈ విద్యార్థిని నాగభావనను వైస్ ప్రిన్సిపాల్ కె.ఆర్ మంజుల, ఎలక్ట్రానిక్స్ అధ్యాపకురాలు కిరణ్మయి, అధ్యాపకులు అభినందించారు.

గండి పూడ్చివేత

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం విజయవాడ ప్రధాన రహదారి తోట మూల సమీపంలోని కట్టలేరు పై డ్రైవర్షన్ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు వరదతో గండిపడటంతో తిరువూరు శాసనసభ్యులు కొక్కిలిగడ్డ. రక్షణ నిధి ఆదేశాల మేరకు 24 గంటల్లో గండి పూడ్చి రహదారి పూర్తి చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు .20 గ్రాముల ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు .వరద తగ్గటంతో గండి పూడ్చివేయటం తో ప్రయాణికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలో 'బ్రో' చిత్రయూనిట్ సందడి

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : విజయవాడలో బ్రో మూవీ చిత్రయూనిట్ సందడి చేసింది. ఇటీవల రిలీజ్ అయిన బ్రో మూవీ చిత్రం విజయోత్సవంలో భాగంగా చిత్ర బృందం విజయవాడకు వచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని ఒక హొటల్లో తమ విజయోత్సవ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ తన మామయ్య పవన్ కళ్యాణ్ పక్కన నటించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఎప్పుడు ఎప్పుడు చిరంజీవితో నటించే అవకాశం వస్తుందని వేయికళ్లతో ఎదురు చూస్తున్నానీ చెప్పారు. మల్టీ స్టార్ చిత్రాలలో నటించడానికి నేను సిద్ధంగా ఉన్నాననీ, మంచి కథ వస్తే కచ్చితంగా చేస్తాననీ తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఒక షార్ట్ ఫిలిం చేయడం జరిగిందన్నారు. ఆగస్టు 15న ఆ షార్ట్ ఫిలిం రిలీజ్ చేయనున్నామనీ తెలిపారు. అంబటి రాంబాబు మీద జోకులు వేసే ఉద్దేశంతో ఆ సీన్ తీయలేదనీ, సినిమాని సినిమాగానే చూడండనీ... సినిమాలకు రాజకీయాలకు ముడి పెట్టవద్దనీ కోరారు.

పసుపు పంటలో సస్యరక్షణ చర్యలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండల పరిధిలోని అగినపర్రు గ్రామంలో మెట్ట పై వేసిన పసుపు కంద పంటలో వ్యవసాయ శాఖ జిల్లా ఉద్యానశాఖధిరి జ్యోతి తీసుకోవాల్సి చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం సదరు గ్రామంలో పొలం బడి కార్యక్రమం లో ఇటీవల కురిసిన వర్షాలకు పసుపు కంద పంటలో తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి డి.ఆర్.సి.ఎ.డి.ఏ.శ్రీనివాస్ రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.ఓ గణేష్ రెడ్డి ఉద్యాన శాఖాధికారి నాగదేవి గ్రామ సహాయకులు పలువురు రైతులు పాల్గొన్నారు.

నత్తనడకన పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో మంగళవారం నిర్వహించిన డాక్టర్ వైయస్సార్ ఫెంక్షన్ కానుక సాంకేతిక కారణాలు మూలంగా నత్తనడకగా సాగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు సర్వరుకు అనుసంధాన మైన యాప్ బ్రేక్ (ఫెయిల్) అవటంతో పంపిణీ కేవలం 48.51 శాతం మాత్రమే జరిగింది.

ఫార్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మూడు రోజులు పాడు జరిగే 1 నుంచి 10వ తరగతి వరకు ఫార్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు సోమవారం ప్రారంభమైనాయి. మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలతో కలిపి 70 పాఠశాలల్లో 5,450 మంది వరకు పిల్లలు పరీక్షలు రాస్తున్నారని విద్యాశాఖ పేర్కొంది. మొవ్వలోఈ పరీక్షలను మండల విద్యాశాఖ అధికారిణి -2 కాటూరి శ్రీలక్ష్మి పరిశీలించారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.7,280 జరిమాన

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రతివారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి వి.విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సర్కిల్-2 కార్యాలయంలో మొబైల్ కోర్టు నిర్వహించిన నిబంధనలు ఉల్లంఘించిన వారిపై అపరాధ రుసుం విధించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై చెత్త వేసేవారు, మురుగునీటి ప్రవాహానికి అడ్డుపెట్టేవారు, రోడ్లపై పెంపుడు జంతువుల్ని ఉంచేవారు, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు 24 మందిపై కేసులు నమోదుచేసి వారిని మొబైల్ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. కేసులను విచారించిన న్యాయమూర్తి నిందితులపై నేరం రుజువు కావటంతో వారికి రూ.7,280 అపరాధరుసుం విధించారు. అనంతరం న్యాయమూర్తి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్-2, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

పాల కేంద్రంలో కంప్యూటర్ సేవలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి: కూచిపూడి లోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సహాయక సంఘంలో రూ.70 వేలతో ఏర్పాటు చేసిన కంప్యూటరును మంగళవారం పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామో దర కృష్ణ గోపీనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దీని ద్వారా కొనసాగించే సేవలను పాడి రైతులకు వివరించారు. కృష్ణామిల్కు యూనియన్ ద్వారా పాడి రైతులకు అందజేసే సదుపాయాలను సైతం వివరిస్తూ అత్యధికంగా పాల రేటును అందజేస్తూ రైతులను ప్రోత్సహించేది కృష్ణా మిల్క్ యూనియన్ అని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు పైడిపాముల మనోహరం, సూపర్వైజర్ కైలా రమేష్, వేతన కార్యదర్శి మహంకాళి సత్య శ్రీనివాస్, టెస్టర్ లంకపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కుక్కలతో అవస్థలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట పంచాయతీలో కుక్కల బెడద తీవ్రం కావటంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పంచాయతీలోని ప్రభుత్వాసుపత్రి రహదారి, కొత్తపేట, ఎస్సీవాడ, కోలేటి ఎస్సీవాడ, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో సంచరిస్తున్న ఊరకుక్కల కారణంగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల పశువులు, కోళ్లు కుక్కల బారిన పడటంతోపాటు, పలువురు స్థానికులు సైతం కుక్కకాటుకు గురైనట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ సర్పంచి ఎస్.నాగమల్లేశ్వరిని వివరణ కోరగా, కుక్కల బెడద నివారణకు వెంటనే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దున్నేవాడిదే భూమి...

పండించేవాడికే భూహక్కు కల్పించాలి

విశాలాంధ్ర-తిరువూరు: దున్నేవాడిదే భూమని, పండించే వాడికే భూమిపై యాజమాన్యపు హక్కు కల్పించాలని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా డిమాండ్ చేశారు. పేదలు సాగులో ఉన్న భూమికి హక్కు కల్పించాలని కోరుతూ మంగళవారం మండలంలోని అక్కపాలెం గ్రామంలో సీపీఐ నాయకులు భూ ఆక్రమణ కార్యక్రమం నిర్వహించారు. సాగుదారులతో కలిసి పేదలు సాగుచేసుకుంటున్న భూముల్లో ఎర్ర జెండాలు పాతారు. సెంటు భూమి లేని నిరుపేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద రైతులు గత 30 సంవత్సరాల నుంచి ప్రభుత్వ బంజర భూమిని సాగు చేసుకుంటున్నారని, ఇప్పటికీ ఆ భూమి మీద యాజమాన్యపు హక్కు కల్పిస్తూ, ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయలేదని నాగుల్ మీరా ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి పేద సాగుదారులకు భూమిపై హక్కు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, బడుగు బలహీనవర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరగాలంటే ప్రభుత్వ బంజరు, పోరంబోకు భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేయాలని, భూపోరాటాల ద్వారా రాష్ట్రంలో కొన్ని లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేసిన చరిత్ర సీపీఐ పార్టీకి ఉందని తెలిపారు. ప్రభుత్వాధికారుల నుంచి సానుకూల నిర్ణయం రాకపోతే పేదల పక్షాన మరోసారి భూపోరాటాలు చేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధంగా ఉంటుందని నాగులు మీరా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, పేద సాగుదారులు మైల శ్రీరాములు, నల్ల బూతు కృష్ణయ్య, మీనుగు కృష్ణ, మహిళ పేరయ్య, మాలపాటి వెంకటేశ్వర్లు, మాలపాటి లక్ష్మి, వలి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న వైఎస్ఆర్ బడుగు వికాసం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జగనన్న వైఎస్ఆర్ బడుగు వికాసం పథకం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన యువ పారిశ్రామిక వేత్తలకు లభించిన గొప్ప అవకాశమని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేదం చెందాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జగనన్న వైఎస్ఆర్ బడుగు వికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మంజూరైనా నూతన కార్లను మంగళవారం కలెక్టర్ స్థానిక కలెక్టర్ కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని పేదలను జగనన్న వైఎస్సార్ బడుగు వికాసం పథకం కింద బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుతో పాటు ప్రభుత్వ సబ్సిడీ అందించి పారిశ్రామిక వేత్తలను చేయాలన్నదే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కే.శ్రీనివాసరావు, ఎల్డీఎం ప్రియంక, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు.

బాల్ పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

రాష్ట్రీయా బాల్ పురస్కార్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డులను ప్రధానం చేసేందుకు 18 ఏళ్ళ లోపు బాల బాలికల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. కీడలు, సామాజిక సేవా రంగం నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక సాంప్రదాయాలు తదితర రంగాల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన బాల బాలికలు అవార్డుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. అర్హత గల బాలలు తమ దరఖాస్తులను ఆగస్టు 31వ తేది లోపు https://awards.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

జిల్లాలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతను నివారించి మాతా శిశు మరణాలను నియంత్రించేం దుకు మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్నాట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ పీడీ జీ.ఉమాదేవి ప్రర్యవేక్షణలో జిల్లాలో 1475 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 18,795 గర్భిణీలు, బాలితలకు, 7 నెలలు నిండి మూడేళ్ళలోపు 47,125 మంది చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీకి సిద్ధం చేసిన్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే కిట్లును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

తిరువూరు-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ప్రారంభం

విశాలాంధ్ర-తిరువూరు: ప్రయాణికుల సౌకర్యార్థం తిరువూరు - మచిలీపట్నం ఎక్స్ ప్రెస్ సర్వీస్ ను పునః ప్రారంభించిన్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. మంగళవారం ఉదయం 5:30 గం.లకు తిరువూరు నుంచి మచిలీపట్నానికి ఎక్స్ ప్రెస్ సర్వీస్ బయలుదేరిన్నట్లు డీఎం పేర్కొన్నారు. తిరువూరు బస్ డిపో ఏర్పడినప్పటి నుంచి పరిసర ప్రాంత ప్రయాణికులు ఉమ్మడి కృష్ణా జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించడానికి ఈ ఎక్స్ ప్రెస్ సర్వీస్ ఎంతగానో ఉపయోగపడుతుంది. గత రెండు సంవత్సరాల నుంచి నష్టాల సాకుచూపి ఆర్టీసీ అధికారులు ఈ సర్వీస్ ను నిలిపివేయడంతో ఆయా పనుల నిమిత్తం ఉమ్మడి కృష్ణా జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా కలక్టరేట్, జిల్లా న్యాయస్థానం, జిల్లా పరిషత్ ర్యాలయానికి వెళ్ళి రావడానికి పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై తిరువూరు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు. ప్రయాణికుల ఇబ్బందులను డీఎం దృష్టికి తెచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పార్టీ కార్యదర్శి ఎస్ కే నాగులు మీరా, పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ లు డిపో మేనేజర్ వేణు ను కలిసి ప్రయాణికుల ఇబ్బందులను వివరించారు. తిరువూరు-బందరు సర్వీస్ పునరుద్ధరించాలని వినతి పత్రం కూడా సమర్పించారు. సీపీఐ నేతల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న డీఎం మచిలీపట్నం ఎక్స్ ప్రెస్ సర్వీస్ ను ప్రారంభించారు. యధావిధిగా తిరువూరు నుంచి ఉద 5:30 గం.లకు బందరు ఎక్స్ ప్రెస్ సర్వీస్ బయలుదేరుతుందని, ప్రయాణికులు ఈ బస్ సర్వీస్ ను ఉపయోగించుకోవాలని డీఎం కోరారు. సీపీఐ నాయకుల చొరవతో మచిలీపట్నం ఎక్స్ ప్రెస్ సర్వీస్ పునః ప్రారంభించడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

కృష్ణలంక, ఇబ్రహీంపట్నం స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన డీసీపీ విశాల్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం) : విజయవాడ కృష్ణలంక, ఇబ్రహీపట్నం పోలీస్ స్టేషన్‌లను మంగళవారం డీసీపీ విశాల్‌గున్ని ఆకస్మిక తనిఖీలు చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డ్సలను పరిశీలించారు. ఈ సందర్భంగా విశాల్ గున్ని ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్‌ల పరిధిలో పెండింగ్ కేసులను తగ్గించాలని, బీట్స్ పెంచి స్టేషన్ పరిధిలో జరిగే నేరాలపై దృష్టి సారించాలన్నారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి నిఘా పెంచి వాటి పూర్తిస్థాయి నియంత్రణ చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదగా వ్యవహరిస్తూ, చట్టపరమైన సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని, స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లాను గంజాయి రహిత నగరంగా చేయాలని పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పవిత్ర సంఘమంను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగు సూచనలు సలహాలు చేశారు. ఈకార్యక్రమంలో ఏసీపీ డాక్టర్ బీ.రవికిరణ్, సీఐలు పి.శ్రీను, ఎం.దుర్గారావు, ఎస్సైలు తదితరలు ఉన్నారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విభజన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వస్తేనే అన్ని విధాలు అభివృద్ధి చెందుతుందని ఆ దిశగా పోరాటం చేస్తున్న తెలుగు రాజ్యాధికారి సమితి పార్టీ ఒక్కటే అని ఆ పార్టీ ఏపి అధ్యక్షులు,హైకోర్టు న్యాయవాది జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజనులు అయిన ఎస్సీలు,బీసీలు, ఎస్టీలు మైనార్టీలు,పేద ప్రజలు ఆర్థికంగా సామాజికంగా,రాజకీయంగా ఎంతో వెనకబడి ఉన్నారని వారికి రాజ్యాధికారం వచ్చినప్పుడే డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కన్నకళ నిజమైవుతందన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయటంలో,వాటిని సాధించుకొవటంలో అన్ని పార్టీలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. ముఖ్యంగ్రా ప్రత్యేక హోదా లభిస్తేనే పారిశ్రామిక అభివృద్ధి జరిగి యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అంతే కాకుండా రాష్ట్రం అప్పులఊబిలో నుండి బయటపడే అవకాశం ఉందన్నారు. హెూదా కావాలంటూ న్యాయపోరాటం చేసే ఏకైక పార్టీ ఏదైనా ఉందంటే అది మా పార్టీ మాత్రమే అన్నారు.రానున్న ఎన్నికల్లో పార్టీ అన్ని స్థానాలకు అసెంబ్లీ,పార్లమెంట్‌కు అభ్యర్థులను నిలబెడుతుందన్నారు. ప్రజల సమస్యలు,హక్కుల కోసం ప్రజాక్షేత్రంలో, న్యాయ క్షేత్రంలోనూ పోరాటం చేయడానికి ముందుటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జల్లి అనిల్ కుమార్,ధ్రువ,పాల్గొన్నారు.

ఎరికల్ ముత్తురాజు కాంస్య విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర-విజయవాడ : తొలి తెలుగు శాసనకర్త ముత్తురాజు ధనంజయుడి కాంస్య విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డికి పివిఎల్ఎన్ రాజు దంపతులు వినతిపత్రం ఇచ్చారు. తెలుగుభాషను కడప జిల్లా కలమళ్ళలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో తొలి తెలుగుశాసనం చెక్కించిన మహనీయుడు "ఎరికల్ ముత్తురాజు" ధనంజయుడని వివరించారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్మరించుకునేలా జీవో ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయ బాబు ఆధ్వర్యంలో "తొలి తెలుగు దివ్వె - తెలుగు మూలాల అధ్యయన సంఘం", ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పివిఎల్ఎన్ రాజు, అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీ తులసి కలిసి 'తెలుగు భాషకు ఆద్యులు - తెనుగోళ్లు' గ్రంథాన్ని అందజేసి వినతి పత్రం సమర్పించారు. మహాకవి, సినీ గేయ రచయిత దివంగత శ్రీశ్రీ పేరిట అవార్డు ప్రకటిస్తే తెలుగు భాష అభిమానులు, రచయితలు ఆనందం వ్యక్తం చేస్తారని వారు తెలిపారు. అందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. చీఫ్ సెక్రటరీని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు ఆచార్య జి రామచంద్రారెడ్డి, సహకార భూమి పత్రిక ఫోటో సంపాదకులు వై డి ఆనంద్, పివిఎల్ఎన్ రాజు, లక్ష్మి తులసి, పిల్లి పవన్ కుమార్ ఉన్నారు.

వైభవంగా దుర్గమ్మ గిరిప్రదక్షణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దుర్గగుడి ఆధ్వర్యంలో ప్రతి పౌర్ణమి నాడు నిర్వహిస్తున్న గిరి ప్రదక్షణ మంగళవారం పూర్ణిమ సందర్భంగా భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు దేవాదాయశాఖ మంత్రివర్యులు కొట్టు సత్యనారాయణ దంపతుల వారు ఆలయమునకు విచ్చేయగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. అనంతరం శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన సేవ నందు పాల్గొన్నారు వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ చైర్మన్ రాంబాబు, కార్యనిర్వాహణాధికారి భ్రమరాంబ, అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. గిరిప్రదక్షిణ కార్యక్రమము శ్రీ కామధేను అమ్మవారి ఆలయము, కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్థంబాల సెంటర్, సితార, కబేలా, పాల ఫ్యాక్టరీ, చిట్టి నగర్, కొత్తపేట, నెహ్రు బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, ఘాట్ రోడ్ మీదుగా డప్పులు తదితర సాంస్కృతిక కార్యక్రమముల నడుమ తిరిగి ఆలయమునకు చేరుకున్నారు. గిరిప్రదక్షిణ మార్గము నందు భక్తులు ప్రచార రథము లో కొలువై ఉన్న శ్రీ అమ్మవారు, స్వామి వార్లకు భక్తిశ్రద్ధలతో పూలు, పండ్లు, కొబ్బరికాయలు సమర్పించి, పూజలు చేసి, అమ్మవారిని, స్వామి వారిని ప్రార్థించి, అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. అమ్మవారి శిఖరం చుట్టూ పౌర్ణమి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణ చేస్తే భక్తుల కోరికలు త్వరగా తీరుతాయని ప్రతీతి.

అభివృద్ధికి చిరునామాగా : ఎమ్మెల్యే రక్షణనిధి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని తిరువూరు శాసనసభ్యుడు కె.రక్షణనిధి అన్నారు. విస్సన్నపేటలో ఆయన మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. విస్సన్నపేట మండలంలో గడపగడపకూ కార్యక్రమం సందర్భంగా రూ.3కోట్లతో అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించామని, ఇందుకు సంబంధించి, రూ.80లక్షలకు ఆర్థికశాఖ నుంచి అనుమతులు లభించాయన్నారు. వీటితోపాటు నరేగా నిధుల ద్వారా మండలవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. మండలంలో మొత్తం 15 గ్రామ సచివాలయాల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, వీటిలో 14 పూర్తి కావచ్చాయని, మిగిలిన కొద్దిపాటి పనులు కూడా పూర్తి చేసి, త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, డీసీసీబీ సభ్యురాలు భూక్యా రాణి, విస్సన్నపేట సర్పంచి ఎస్.నాగమల్లేశ్వరి, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాశక్తి పథకంతో తెలుగుదేశం విజయం

విశాలాంధ్ర-ఎ.కొండూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి మెనీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన, సూపర్ సిక్స్, మహాశక్తి పథకాలు మహిళలకు వరమని తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ శావల దేవదత్ పేర్కొన్నారు. మీ భవిష్యత్తుకు మా గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పోలిశెట్టిపాడు గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గద్ది కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు తిరుగుతూ ముమ్మర ప్రచారంనిర్వహించారు. ఈ సందర్భంగా మ్యానిఫెస్టోలో పొందపరచిన అంశాల గురించి కరపత్రాల రూపేణా తెలియపరిచారు. ఈ సందర్భంగా దేవదత్ మాట్లాడుతూ ఇంటింటికి మంచినీటి పథకం కింద ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్,ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు వంటి పథకాలను ఇంటింటికి తిరుగుతూ మహిళలకు తెలియజేసి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వాసం మునయ్య , మండల పార్టీ అధ్యక్షులు గద్ది కృష్ణారెడ్డి, వనపర్ల డేవిడ్ రాజు గ్రామ సర్పంచ్ బొల్లెపోగు చిట్టిబాబు, గ్రామ పార్టీఅధ్యక్షుడు తుమ్మూరు శ్రీనివాస్ రెడ్డి,భీమాల నాగేశ్వరరావు, చెన్నా వెంకటేశ్వర్లు, గోగులముడి రాంప్రసాద్ రెడ్డి, బొల్లెపోగు విజయ్, చల్లారి గణపతి,ఎం.శ్రీను, బొల్లె పోగు శ్యామ్, భీమాల నాగేశ్వరరావు, నాదేళ్ల నాగమణి, బలమూరి నాగపద్మ,జరబల మంగమ్మ, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ పరికరాల : సీపీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా, కృష్ణాజిల్లా సీపీ జాషువాలు ట్రాఫిక్ సిబ్బందికి అందజేశారు. మంగళవారం విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ట్రాఫిక్ నియంత్రణ పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని తగ్గించాలనే ఉద్దేశంతో నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణను ఆధునీకరణలో భాగంగా గతంలో పలు ట్రాఫిక్ నియంత్రణా పరికరాలను కొనుగోలు చేశారు. నగరంలోని ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తమవంతు కృషిగా ట్రాఫిక్ సిబ్బందికి రేడియం జాకెట్స్, ఎల్.ఈ.డి.బాటన్స్, వీల్ లాక్స్, రెయిన్ కోట్స్, ట్రాఫిక్ కోన్‌లను సోలార్ బ్లింకర్ స్టాపర్స్ మొదలగు ట్రాఫిక్ నియంత్రణా పరికరాలను హైదరాబాద్ ఎస్.ఆర్.మీడియా సహకారంతో బి.ఎస్.ఆర్. జువెలరీ స్వచ్చందంగా తయారు చేయించి ఇచ్చారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, నగరంలో హెల్మెట్ పై అవగాహన కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. మోకా సత్తిబాబు గారు, ఏ.డి.సి.పి.లు ప్రసాద్, సి.హెచ్. లక్ష్మీపతి, ట్రాఫిక్ ఏ.సి.పి. జే.వెంకట నారాయణ, , బి.ఎస్.ఆర్. మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ చరణ్ రెడ్డి, ఎస్.ఆర్.మీడియా మేనేజింగ్ డైరెక్టర్ వి.సత్యారెడ్డి, ఇన్స్పెక్టర్లు, పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7 వరకు తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : తల్లిపాల విశిష్టతను చాటి చెప్పి, పుట్టిన నాటి నుండే చిన్నారులకు తల్లిపాలను అందించేలా మహిళలను చైతన్యపర్చేందుకు జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ జీ.ఉమాదేవి తెలిపారు. అయోడైజ్డ్ ఉప్పు వినియోగంలో మన రాష్ట్రం జాతీయ సగటులో చివరి స్థానంలో ఉందని ఫలితంగా అయోడిన్ లోపంతో బాద పడుతున్న వారి సంఖ్య పెరుగుతుందన్నారు. తల్లిపాల వారోత్సవాల ద్వారా ఆరోగ్యవంతమైన ప్రయోజనాలపై తల్లులకు వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ అందించడం, మిలెట్ల వినియోగం వల్ల ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. తల్లిపాల విశిష్టతపై పాఠశాల స్థాయిలో క్విజ్, వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రసంశ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ధీరజ్‌కు రెండవ స్థానం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ.చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో స్వర్గీయ చెరుకూరి లెనిన్, ఇండియన్ ఆర్చరీ కోచ్ వద్ద శిక్షణ పొందిన బొమ్మదేవర ధీరజ్, భారతజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ మంగళ వారం జర్మనీలోని బెర్లిన్ లో జరిగిన రికర్వ్ క్వాలిఫైయింగ్ రౌండ్లో 720 పాయింట్లకు 683 పాయింట్లు సాధించి బొమ్మదేవర ధీరజ్ ద్వితీయ ర్యాంక్లో నిలిచాడు. 2008 చైనా ఒలింపిక్స్ భారత ఆర్చర్ మంగళసింగ్ సాధించి ర్యాంక్తో సమానముగా ప్రపంచ ఆర్చరీ చాంపియన్షిప్ ఒలింపిక్ క్వాలిఫైయింగ్ రౌండ్ అయిన ఈ చాంపియన్ షిప్ లో బొమ్మదేవర ధీరజ్ 2వ ర్యాంక్ సాధించడం ద్వారా ఒలింపిక్ బెర్త్ అవకాశాలను మెరుగుపరచి దేశప్రతిష్టను ఆర్చరీలో తెలుగువాడి సత్తాను చూపించినందుకు బొమ్మదేవర ధీరజ్ చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ధీరజ్ను, వారి తల్లిదండ్రులను, వారి శిక్షకులను ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ అభినందించారు.

ఆజాదికా అమృత సరోవర్ పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర- కంచికచర్ల: ఆజాది అమృత సరోవర్ కార్యక్రమంలో భాగంగా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత మంగళవారం మండలంలోని పరిటాల గ్రామంలోని చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాది అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా పరిటాల చెరువును ఎంపిక చేయడం జరిగిందని చెరువు అభివృద్ధి పనులు ఆగస్టు 15 తారీకు కల్లా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాల శంకర్, ఈవోపీఆర్డి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఆనంద జ్యోత్స్న, పంచాయతీ సెక్రెటరీ ఖాదర్ మీర్జావలి, నాయకులు చింతా రవి, మార్తా శ్రీనివాసరావు, ఏపీవో రమాదేవి, అమృత్ సరోవర్ బృందం, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువ పై సమీక్ష

విశాలాంధ్ర-గంపలగూడెం : పాడి లేదా సూడి గేదెల కొనుగోలుకు వైయస్సార్ చేయూతలో డాక్రా మహిళలకు ప్రభుత్వం ఇచ్చే రూ.18,750 మిగతా నగదు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పాల దిగుబడిన పెంచాలని డ్వాక్రా మహిళలకు ఎంపీడీవో ఎర్రమల పిచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మండల సమైక్య కార్యాలయంలో జగనన్న పాలవెల్లువ కేంద్రాలలో పాల సేకరణ పెంచడం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశు సంవర్థక శాఖ ద్వారా పాడి లేదా చూడు గేదెలకు ఇన్సూరెన్స్ చేయటం జరుగుతుందని కావలసిన వారికి గేదెలను కంకిపాడు నుండి కొనుగోలు చేయాలని ప్రభుత్వ ఆదేశాల అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య లు డి. అభిలాష్, ఏపిఎం చిన్న ఆనందం, మండల సమైక్య అధ్యక్షు రాలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల కు యూనిఫామ్ పంపిణీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : స్థానిక పురపాలక సంఘం లో పని చేస్తున్న పారిశుద్ధ్య మరియు పారిశుధ్యేతర కార్మికులకు 3 సంవత్సరములకు ఇవ్వవలసిన దుస్తులు, సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు తదితర వస్తువులను మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర చేతుల మీదుగా ఇవ్వడం సోమవారం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమీషనర్ మల్లేశ్వరరావు, వైస్ చైర్ పర్సన్లు, కో-ఆప్షన్ సభ్యులు, పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

3,72,886 మందికి సర్టిఫికేట్లు ఇచ్చాం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, పలు ఆర్జీలను పరిష్కరించి 3 లక్షల 72 వేల 886 సర్టిఫికేట్లను జారి చేసిన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డా.పీ.సంపత్ కుమార్ తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై మంగళవారం జేసీ స్థానిక కలెక్టర్ కార్యాలయంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు అవసరమైన వివిధ సర్టిఫికెట్లును కార్యాలయాలకు వెళ్లకుండానే తక్షణమే మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు ద్వారా సాధ్యమైనంత త్వరగా గడువులోపు సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 16 మండలాలు, 5 మున్సిపాలీటీల్లో 605 గ్రామ, వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష సేవలు అందజేసిన్నట్లు తెలిపారు. 10,669 మంది వాలంటీర్లు ఈ కార్యక్రమంలో ప్రజలకు సేవలందించారని, 7, 23,354 కుటుంబాలకు 6,79,538 కుటుంబాలకు సర్వే పూర్తి చేశామన్నారు. వలస వెళ్లిన, మరణించిన, ఆసక్తి చూపని వివిధ కారణాల వల్ల మిగిలిన 43,816 కుటుంబాలకు సర్వే పూర్తి చేయాల్సి ఉందని, ప్రజల నుండి 3,94,415 ధరఖాస్తులు స్వీకరించగా వాటిలో 3,72,886 ఆర్జీలకు సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. ఇందులో 1,61,159 ఇంటిగ్రేడెట్, 1,38,808 ఇన్‌కమ్, మరో 72,919 సర్టిఫికెట్లుకు ఆర్‌వోఆర్ 1బీ, రీఎస్యూరెన్స్ ఇంటిగ్రేటెడ్, కంప్యూటరైజడ్ అడంగల్, రీఎస్యూరెన్స్ ఆదాయ సర్టిఫికేట్లు, ఆధార్‌తో మొబైల్ నెంబర్ అనుసంధానం, చిరునామ మార్పు, న్యూ రైస్ కార్డు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్, ఆరోగ్యశ్రీ, ఓబీసీ సర్టిఫికేట్, ఎన్‌కంబరెన్స్, జనన మరణ దృవీకరణ, ఇన్‌కమ్ సర్టిఫికేట్లు జారీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన 13 వేల ఆర్జీలు గడువులోగా పరిష్కరించి అవసరమైన సర్టిఫికేట్లను జారీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

తెగిపోయిన కంచల రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నందిగామ: ఇటీవల వచ్చిన వరదలకు కంచల గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు గండి పడి తెగిపోయిన విషయం తెలిసినదే స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు మంగళవారం తెగిపోయిన రోడ్డును పరిశీలించి అధికారులకు త్వరితగతిన రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని సూచించారు.నందిగామ మండలంలోని కంచల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మొన్నటి భారీ వర్షాలకు, వరదలకు నీటి ఉధృతి పెరగడంతో గండి పడి రోడ్డు తెగిపోయి రాకపోకలకు అంతరాయం కలగడంతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డును వేయించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి వర్షాలకు, వరదలకు మండలంలో వ్యవసాయ పంటలకు, గ్రామాలకు వెళ్లే రహదారులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని తెలిపారు. అనుకోని విధంగా వరద నీటి ప్రవాహ ఉధృతి పెరగడంతో కంచల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గండిపడి కొట్టుకుపోవడం జరిగిందని, దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్న విషయం తెలియగానే ఆర్ అండ్ బి అధికారులకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఆర్ అండ్ బి అధికారులు కంచల రహదారిని పరిశీలించి, గండిపడి కొట్టుకుపోయిన తూముల ఏర్పాటు, రోడ్డు ఏర్పాటుకు సుమారు రూ.27 లక్షలు అవుతుందని అంచనాలు రూపొందించారని, ఫ్లడ్ డామేజ్ రోడ్స్ ఫండ్స్ నుండి త్వరిత గతిన నిధులు మంజూరు చేయించి, రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసు కుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తూర్పు బజారుకు మంచినీటి సరఫరా పునరుద్ధరణ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పెనుగంచిప్రోలు రక్షిత మంచినీటి సరఫరా పథకాలకు తీవ్రమైన ఆటంకం కలిగింది.. ఉధృతంగా పొంగిపొరలిన మున్నేరు ఉపనది ప్రవాహానికి గ్రామ ప్రజలకు నీరు అందించే రెండు రక్షిత మంచినీటి పథకాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సూచనల మేరకు సర్పంచ్ పద్మ కుమారి ఆర్డబ్ల్యూఎస్ డిఈ రవికుమార్‌కు ఈ విషయమై వివరించారు. డిఈ రవికుమార్ సర్పంచ్ పద్మకుమారి, కార్యదర్శి శ్యామ్‌కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్‌లు ప్రత్యేకమైన దృష్టిపెట్టి గ్రామపంచాయతీ సిబ్బందిని, వాటర్ వర్క్స్ సిబ్బందిని రంగంలోకి దింపి ప్రవహిస్తున్న మున్నేరు నదిలో తెగిపోయిన పైపులను మరలా అతికించి అర్ధరాత్రి దాటిన తర్వాత తూర్పు బజారుకు మంచి నీరు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా పద్మకుమారి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో, ఆర్ డబ్ల్యు ఎస్. డిఈ సహకారంతో కార్యదర్శి, గ్రామపంచాయతీ వాటర్ వర్క్స్ సిబ్బంది నిరంతరం కష్టపడి పనిచేయడం వల్ల వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించగలిగామని చెప్పారు.

CHANGE OF NAME

I, C. ARUNA KUMARI (Old Name), W/o. Durbha Venkata Anand, R/o. # 8-79, Flat No. B-503, Bandis Capital Gate Way, Beside Ambedkar ITI, Nallakunta, Gollapudi, Vijayawada, NTR Dist., A.P. I, declare that I have changed my name as **DURBHA ARUNA** (New Name). Hereafter my name is known and called as **DURBHA ARUNA.**